వారం వారం కథా ప్రభ

మల్లాది సూరిబాబు

# అపూర్వరూపం

ఆ నాటి ఉదయం అనుష్టానం పూర్తి చేసుకుని - దైనందిన కార్యక్రమాలలో పాల్గొనటానికి సిద్ధం అవుతుండగా మా ఇల్లాలు వచ్చి "మీ కోసం ఒక వింత మనిషి వచ్చారు" అని అంది.

"వారి వివరాలు తెలుసను కున్నావా?"

"మన ప్రాంతంవారి లాగా కనిపించడం లేదు. సంపన్నుడు అని వేషం, మీ కోసం వచ్చాడు కాబట్టి పండితుడేమోనని అనుమానం కలుగుతోంది."

"అతిథి మర్యాదలు చేస్తూ ఉండు. నేను ఇప్పుడే వస్తాను... హయగ్రీవ శ్లోకం... చదువుకుని వస్తాను...."

రవ్వంత సేపటికి నేను ముందు సావిట్లో అడుగు పెడుతూ ఆయన్ని చూసి ఒక్క క్షణం అక్కడే ఆగాను.

ఒక శతాబ్దం వెనుకటి వంగదేశపు జమీందారి వద్దతిలో ఉన్నాడు. అందమైన విగ్రహం. ఆకర్షణీయమైన రూపం. గిరజాల జుట్టు. మంచి మీసకట్టు. శరీరం మీద పట్టువస్త్రాలు. మెడలో పచ్చల పతకం ఉన్న చిన్న హారం. వేళ్లకు విలువైన ఉంగరాలు.

నన్ను చూడగానే లేచి నిలబడి - "హరితస అంబరీష యవనాశ్వయ గోత్రి: ఆపస్తంబ సూత్ర: శుక్ల యజుశ్శాఖాధ్యాయి. సురేంద్రనాథ పుత్ర: వీరంద్రనాధ: అహంభో! అభివాదయె" అంటూ రెండు చేతులు జోడించి తలవంచి నమస్కరించాడు.

నేను ప్రతి నమస్కారం చేస్తూ "కూర్చోండి" అని బెంగాలిలో అన్నాను.

ఆ మాట వినగానే ఆయన ముఖంలో చాలా ఆనందం కనిపించింది....

"మీ సహాయాన్ని అర్థిస్తూ చాలా దూరం నుంచి వచ్చాను."

"చెప్పండి."

"మా కుటుంబంలోని వారు అందరు




రామభక్తులు. ప్రతినిత్యం శ్రీమద్ రామాయణం మా ఇంట్లో పారాయణ జరుగుతుంది. మా నాన్నగారి హయాంలో రామాయణ పారాయణతో బాటు రామాయణం మీద పురాణం కూడా చెప్పించడం ప్రారంభించారు. నా తరంలో రామాయణ యజ్ఞం ప్రారంభించాను" అంటూ

కన్యాకుమారి వరకు, తూర్పున అస్సాం నుంచి పడమట ద్వారక వరకు గల పుణ్యక్షేత్రాలన్నీ దర్శించే అదృష్టం నాకు కలిగింది."

"చాలా సంతోషకరమైన విషయం. ఎంతో పుణ్యప్రదం."

ఈ పర్యటనలో నేను గ్రహించిన విషయం ఒకటి. రూపు రేఖలు వేరు కావచ్చు. భాషలు ఆచారాలు సాంప్రదాయాలు వేరు కావచ్చు. కాని ఆసేతు హిమాచల పర్యంతం చిన్న చిన్న మార్పులు, చేర్పులు మినహాయిస్తే - ఈ భరత ఖండంలో అంతా రామమయం - ఈ జగమంతా రామ మయం ... ఏ భక్తుని హృదయంలోకి తొంగి



అతను చెబుతూ ఉంటే -

"రామాయణ యజ్ఞం అంటే" అని నేను అడిగాను.

"మనవి చేస్తాను. మా తాతగారు వారి పేరే నాకు పెట్టారు. వారికి తీర్థయాత్రలు పుణ్య క్షేత్ర దర్శనం చాలా ఇష్టం. అలాగే మనుమలలో నేనంటే చాలా ఇష్టం... వారి పర్యవేక్షణలో కాశ్మీరం నుంచి

చూసినా వినిపించే మాట -

ఓ రామ! నీ నామ మెంతో రుచిరా?

ఎంతో రుచి. ఎంతో రుచి ఎంతో రుచిరా!!

చాలా చక్కటి ఆలోచన

తీర్థయాత్రల నుంచి తిరిగి రాగానే నా మనస్సులో ఒక సంకల్పం కలిగింది."

"ఏమని?"

"వివిధ భాషలలోని రామాయణాలలోని విషయాలు తెలుసుకుందామని కోరిక కలిగింది. వెంటనే కార్యక్రమం ప్రారంభించాను. దీనిని మా ఊరిలోని పండితులు శ్రీ రామాయణ యజ్ఞం అని నామకరణం చేశారు."

"ఏ రామాయణాలు ఇంతవరకు అధ్యయనం చేశారు?"

"శ్రీ అధ్యాత్మ రామాయణం. శ్రీమద్‌వాల్మీకి రామాయణంతో ప్రారంభించాము. ఆది కావ్యం అదేగా! హిందీలో తులసీదాస్ 'రామచరిత మానస్' , మైధిలీ శరణ్ గుప్త 'సాకేత' వంగ భాషలో, 'కృత్తివాస రామా యణం' మైకేల్ మధు సూదన్ దత్తు రచించిన 'మేఘనాద్ వధ', ఒక అజ్ఞాత కవి ఒరియా భాషలో రాసిన రామాయణం, ఆంధ్రభాషలో గోపీనాధ రామాయణం, మొల్ల రామాయణం, నిర్వచనోత్తర రామాయణం, అరవంలో కంబ రామాయణం, కన్నడంలో పంబ రామాయణం, మలయాళ భాషలో శ్రీ యెజుచ్చెజియన్ రాసిన రామాయణం.. ఇవనీ పండితుల చేత చదివించుకుని విన్నాం. కాని..."

"చెప్పండి?"

"ఇన్ని చదివినా, వినినా ఏదో ఎక్కడో లోపం వెలితి మనస్సుకు తోచేది."

"ఎందుకని?"

"అదే మొదట్లో అర్థం కాలేదు. కాని దీక్షితులు గారిని కలుసుకున్న తరువాత చిక్కు సమస్య మంచులాగా హరించుకుని పోయింది."

"ఏ దీక్షతులుగారు..."

"వారణాసిలో ఉంటారే.. మహా మహోపాధ్యాయ శ్రీ సుందరరామ దీక్షితులు గారు. వారిని సంస్కృతి సమ్మేళనంలో కలసినప్పుడు ఈ విషయం మనవి చేశాను..."

"ఆయన ఏమన్నారు?"

"మరాఠీ మోరో పంత్ రామాయణాలు చదివారా? అని అడిగారు. నేను చదవలేదని, ఆ గ్రంథం గురించి వినలేదని చెప్పాను. ఈ తరం వారికి ఆ గ్రంథం గురించి ఎక్కువగా తెలియదు. కాని రామాయణ గ్రంధాలలో అది చాలా ఉదాత్తమైనది. మొదటి ప్రచురణ చదవండి - చాలా బాగుంటుంది అని దీక్షితులుగారు అన్నారు.

ఆ గ్రంథం ఈనాడు ఎక్కడ లభ్యం అవుతుంది? అని అడిగాను.

దీక్షితులుగారు ఒక్క క్షణం ఆలోచించి. మదరాసు మైలాపూర్ లజ్ కార్నర్‌లో సెకెండు హ్యాండు పుస్తకాలు అమ్మే వాసుదేవనాయర్‌ని సంప్రదించండి. మీకు పుస్తకం దొరుకుతుంది అని అన్నారు."

"దొరికిందా?" అని నేను అడిగాను.

"వాసుదేవనాయర్‌ని కలిశాను. పురాతన గ్రంధాలని గురించి ఆయనకు తెలియని విషయం లేదు. గ్రంధాలని గురించి తెలియడమే కాకుండా... ఏ ఏ మహా గ్రంథం ఎవరి దగ్గర లభ్యమవుతుందో చెప్పగలడు- మోరోపంత్ రామాయణం అని అనగానే అతను మీ పేరు చెప్పాడు...."

నేను ఒక్క క్షణం ఆలోచించి... "మోరోపంత్ రామాయణాల అన్నీ కలిపి రెండు వాల్యూములుగా ఉన్నాయి... అది మరాఠీ - సంస్కృతం కలిసిన గ్రంథం. అంత తేలికగా అర్థం కాదు" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాను.

ఆయన మధ్యలో అందుకుని... "మీ దగ్గర ఉన్న ప్రతి 1891లో ఫ్రెంచి దేశంలో ముద్రింపబడినదని, ఈనాడు దాని ఖరీదు లక్షలలో పలుకుతుందని విన్నాను. కాని భాష విషయంలో నేను అదృష్టవంతుడినే."

"మీకు మరాఠీ కూడా తెలుసునా?" అని ఆయన చిరునవ్వు నవ్వి "ఈ మధ్య అలహాబాదులో శ్రీ మహదేవశాస్త్రి 'జోషి'గారిని కలవడం సంభవించింది. ఆయన ఈ విషయంలో సహాయం చేస్తానన్నారు."

నా మనస్సులో మసలిన మాట. వనితా విత్తం పుస్తకం పర హస్తం గతం గతః...

> **పురుషునికి ఉండవలసినవి**
>
> పురుషుడికి ఉండాలని ఆమె కలలు కన్న సమస్తమూ అతడి కుండెను - డబ్బు!
>
> ★ ★ ★
>
> **ఆడద్వేషి**
>
> స్త్రీ ద్వేషుల్లో ఐదింట నాలుగు వంతుల మంది స్త్రీలు!
>
> ఛాయ

ఆయన నావంక ఒక్క క్షణం చూసి. తన దగ్గర ఉన్న సిల్కు వస్త్రంలో చుట్టబడిన ఒక గ్రంధాన్ని నా ముందు ఉంచాడు.

"అది యాస్కనిరుక్తం. కలకత్తా ఫోర్టు విలియమ్స్‌లో సుమారు 200 సంవత్సరాల క్రితం పరిష్కరించబడి. జర్మనీలో ముద్రింపబడింది.

ఈ పుస్తకం మీ దగ్గర లేదని. దీని కోసం మీరు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది..... మీకు కానుకగా తీసుకు వచ్చాను. స్వీకరించండి.."

సుమారు 20 సంవత్సరాలుగా అన్వేషిస్తున్న ఈ గ్రంథం ఈనాటికి నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

నేను ఇహనేం మాట్లాడలేదు. లోపలికి వెళ్లి మోరోపంత్ రామాయణాలు రెండు సంపుటాల్లు ఆయనకు ఇస్తూ "మీరు పారాయణం చేసి, చైత్ర మాసంలోపల పంపండి" అని అన్నాను.

ఈ లోపల మా ఇల్లాలు పాలు పండ్లు తీసుకుని వచ్చి ఆయన ముందు ఉంచింది. ఆయన లేచి ఆవిడకి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"మీరు పెద్దలు..." అంటూ ఆవిడ వారించ బోయింది. ఆయన లేచి నిలబడి వినయంగా చేతులు కట్టుకుని "అమ్మా! నేను కూడా మీ బిడ్డనే. మా అమ్మగారిది కూడా మీ పేరే" అని అన్నాడు.

ఆవిడ చిరునవ్వు నవ్వి ఎంతో సంతోషంతో ఆయన చేత కొసరి కొసరి తినిపించింది.

ఆయన జేబులోంచి ఒక చిన్న పెట్టె తీసి మాముందర తెరిచారు. దాంట్లో ఒక అపురూపమైన బంగారు నాణెం ఉంది.

పరీక్షగా చూశాను. లక్ష్మి, సరస్వతి, పార్వతి. ఈ మూడు రూపాలు వెనుక వైపున బ్రాహ్మీ లిపిలో ఏదో వాక్యం.

"ఇది మీ దగ్గర ఉంచండి. రామాయణం తిరిగి ఇచ్చినప్పుడు మీ దగ్గర తీసుకుంటాను" అని ఆయన అన్నాడు.

"దీని అవసరం లేదు. మీరు రామాయణం తీసుకు వెళ్లండి" అని మా ఇల్లాలు అంది.

"మీ మీద మాకు నమ్మకం ఉంది. తీసుకు వెళ్లండి" అని నేను అన్నాను.

ఆయన ఆ నాణాన్ని ఆవిడకి ఇస్తూ "దయచేసి నా ప్రార్థనని కాదనకండి. మీ పూజా మందిరంలో ఉంచండి" అని ప్రార్థించాడు.

మేము కాదన లేకపోయాం.

రెండు నెలలు గడిచాయి.

"ఆయనకు నాపేరు ఎలా తెలుసు? మీరు

చెప్పారా?" అని మా ఇల్లాలు నన్ను అడిగింది.

"లేదు" అన్ని సమాధానం చెప్పాను.

అప్పుడు ఇంకోక ప్రశ్న వచ్చింది. "మీ దగ్గర 'యాస్క నిరుక్తం' లేదని, దాని కోసం మీరు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్టు ఆయనకు ఎలా తెలుసు?"

సమాధానం దొరకలేదు.

ఇంకొక నెల గడిచింది. అనుకోకుండా మా ఇంటికి ఒక మిత్రుడు వచ్చాడు. పాత కాలపు నాణాలు సేకరించడం ఆయనకు సరదా. మంచి పండితుడు. ఆయన ఈ నాణెం చూడగానే ఇది చాలా అపురూపమైన నాణెం. 16-17 శతాబ్దాలలో వంగ దేశంలోని ఒక జమీందారి వంశం వీటిని తయారు చేయించింది. ఆ పరగణాలో ఆ నాణాలు చెల్లుబడి అయ్యేవి. ఆనాటి విలువ ఎంతో తెలియదు కాని ఈ నాటి విలువ లక్షలపైనే" అని అన్నాడు.

నాకూ, మా ఇల్లాలికి అకారణంగా భయం వేసింది.

సంక్రాంతి పండుగలలో సుమారు ఇరవై సంవత్సరాల వ్యవధి తరువాత మదరాసు వెళ్లాను. అలవాటుగా వాసుదేవనాయర్ దుకాణం ఉండే చోటుకు వెళ్లాను. ఆ పాత పుస్తకాల దుకాణం అక్కడ లేదు. 5 అంతస్థుల భవనం ఉంది.

ఎవరూ అతన్ని గురించి చెప్పలేకపోయారు. 15 సంవత్సరాలుగా ఈ కొత్త భవనం అక్కడ ఉందిట.

ఫాల్గుణ మాసంలో... ఉగాది ఇంకా వారం పది రోజులు ఉందనగా.... ఒక రోజు అర్ధరాత్రి మా ఇల్లాలు నిద్దరలో ఉలిక్కిపడి లేచింది. నన్ను నిద్దర లేపింది.

"ఏమిటి భవాని" అని అడిగాను.

"మీ రామాయణం స్నేహితుడు కలలోకి వచ్చాడు."

"ఏమన్నాడు?"

"చాలా సంతోషంగా కనిపించాడు. పదే పదే నమస్కారం చేశాడు."

ఇహ ఆ రాత్రి నిద్దర పట్టలేదు. బ్రహ్మ ముహూర్తంలో ఇద్దరం వచ్చి పూజామందిరం దగ్గర కూర్చున్నాం...

ఆ గది అంతా సుగంధంతో నిండి ఉంది.

అమ్మవారి ఎదుట ఉన్న పీట మీద మోరోపంత్ రామాయణాలు పట్టుగుడ్డలో చుట్టి ఉన్నాయి. దాని పక్కనే 'యాస్కనిరుక్తం' యధాస్థానంలో ఉంది. బంగారు నాణెం ఉండే చోట తెల్లటి పువ్వులు. ఎర్రటి కుంకుమ రాసి ఉన్నాయి. నాణెం లేదు.

మా ఇద్దరి మనసుల్లో ఆ క్షణంలో ఆలోచన ఒకటే.

'యాస్కనిరుక్తం' తెరిచి చూశాను... ఆయన చిరునామా ఉన్న కాగితం తీసుకున్నాను.

వెంటనే బయలుదేరి ఆ పరగణాకి వెళ్లి వారం రోజులు ప్రయత్నం చేసి పని పూర్తి చేసుకుని ఇంటకి తిరిగి రాగానే మా ఇల్లాలు వేసిన ప్రశ్న -

"ఆయన కనిపించాడా?"

"ఆయన మనుమడిని కలిశాను."

"ఆయన్ని ఎందుకు కలవలేదు?"

"ఎందుకంటే... ఆయన మరణించారు."

"ఎప్పుడు?" అని అడుగుతూంటే ఆవిడ ముఖంలో భయం కనిపించింది.

నేను ఆవిడని బుజ్జగిస్తూ నెమ్మదిగా సమాధానం చెప్పాను -

"యాభై అయిదు సంవత్సరాల క్రితం" ●

## కుంచెకందని చిత్రం

అపుడు -
సాగిపోతున్న జీవితపు రైలుబండి
నిర్భయత్వపు పచ్చ జండాల్ని ఊపడం లేదు
అయినా - ను వ్వో కుంచెకందని చిత్రమై
సప్త వర్ణాల మిశ్రమై
గుండె నో అష్టమ వర్ణంగా మార్చి
పికాసో[1] చిత్రమయ్యావు
ఎన్ని వేల విస్ఫోటనాలు
నీ మీద అయితేనేం!
చెదరని చిత్రాలకు చితులుంటయ్యా?
ను వ్వో రెంబ్రాంట్[2] కుంచెవయ్యాక
నీ జీవిత కాన్వాసు శిథిలమయితేనేం?
పట్టువదలని యోధునిలా
వాన్‌గో[3] వర్ణమయ్యాక
నీ ఊపిరి చిక్కని చీకటైతేనేం!
ను వ్వో కరకు కఠోర కణమనీ
నీ చేతులు ప్రక్షాళనమవ్వని ఓ రుధిర
యూదు చిత్రమనీ తెలుసు!
అర్థం కానిది నువ్వెలా అందమైన లియెనార్డో[4]
చిత్రమయ్యావని
బహుళ టర్నర్[5] తన కుంచెతో
నీ గుండెకు రంగులు అద్దివుంటాడు
పాల్‌క్లీ[6] నీ ఆలోచనా చిత్రాలకు
ప్రాణం పోసి ఉంటాడు
నిజమే!!
ను వ్వో కరకు కసాయివని చరిత్ర నిర్ధారించి ఉండొచ్చు
కానీ -
అర్థం చేసుకునే హృదయమే ఉంటే
ఇందరి వర్ణాల మిశ్రమంలో ను వ్వో శ్వేతవర్ణమై
ఏ తుఫానుకీ చెరగని శాశ్వత చిత్రమై నిల్చి పోతావు!

**1,2,3,4,5,6 :- యూరోపియన్ చిత్రకారులు.**

*రెండో ప్రపంచ యుద్ధకాలంలో యూరప్‌ని ఆక్రమించిన నాజీ జర్మన్ సైనికాధికారుల్లో ఒకరు యూరోపియన్ చిత్రకళ మీదున్న వ్యామోహం చేత ప్రముఖుల చిత్రాలు దొంగిలించి పారిపోతుండగా, అమెరికన్ సైన్యాలు వెంబడించగా, తప్పించుకునే వీలుండీ, తన దగ్గరున్న చిత్రాలను వదులుకోలేక, వాటికోసం నిర్భీతిగా తన ప్రాణాలని వదులుకున్న వైనం ఈ కవితకు ప్రేరణ.*

**కేతవరపు వర్రే రాణి**